# మనుచరిత్ర – ప్రవరుని సత్వగుణం

డాక్టర్ పప్పల వెంకటరమణ
ఎం.ఏ., పి.హెచ్.డి., (గోల్డ్ మెడల్)
తెలుగు విభాగాధిపతి
ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషులు)
శ్రీకాకుళం.

ఆంధ్ర కవితా పితామహుడు వ్రాసిన మనుచరిత్ర మానవజాతి మణిదీపం. నేటి సమాజంలోని యువతకు వ్యక్తిత్వ వికాసమును కలుగజేయుటలో మరియు సాత్విక గుణములు కలిగించుటలో ముందు వరుసలో ఉంటుంది.

త్రిగుణములు – అనగా సత్వగుణం రజోగుణం, తమోగుణం. ఈ మూడు హిందూ ధర్మశాస్త్రాలలో చెప్పబడిన ప్రధాన గుణములు. భగవద్గీత ప్రకారం సత్వగుణం వల్ల జ్ఞానం, రజోగుణం వల్ల మోహం, తమోగుణం వల్ల అజాగ్రత్త, అవివేకము, మరపు, పరాకు మొదలైనవి కలుగుతాయి. సత్వగుణం కలిగిన వారు స్వర్గలోకాలకు వెళుతున్నారు. రజోగుణం కలిగినవారు మానవలోకంలో జన్మిస్తున్నారు. తమోగుణ ప్రవృత్తి గలవారు అధోలోకాలకు వెళ్తున్నారు. సత్వగుణం అధికంగా కలిగిన వ్యక్తులు ప్రశాంతంగా ఉంటారు, దైవము వైపుకు తిరుగుతారు, మృదువుగా మాట్లాడతారు. రజోగుణం అధికంగా కలిగిన వ్యక్తులు ప్రశాంతంగా ఉండరు. ఎప్పుడూ ఏదో ఆలోచన, ఆందోళన, అసంతృప్తి, అశాంతి, ఏదో చేయాలని తపన చేస్తూ ఉండటం. ప్రాపంచిక విషయాలపై అమిత ఆసక్తి, దానితో నిరంతరం కర్మ రంగంలోకి దూకడం చేస్తుంటారు. తమోగుణం అధికంగా ఉంటే సోమరితనం, తీవ్రమైన కామకోరికలు, నిద్ర, ఇతరుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడటం, దుర్మార్గపు ఆలోచనలు, తిండి ధ్యాస ఎక్కువగా కలిగి ఉంటారు. ఈ మూడు గుణాలు ప్రతివారిలోనూ ఉంటాయి. ఏదో ఒక గుణం ప్రభలంగాను, మరొకటి సాధారణంగాను, వేరొకటి తక్కువగాను ఉంటుంది. ఎక్కువ తక్కువలే గాని అందరిలోనూ ఉండేది ఈ త్రిగుణములే. వీటిలో ఏ లక్షణములతో ప్రవర్తిస్తున్నాము మోహముతోనా, స్వార్థంతోనా లేక త్యాగముతోనా అనే దానిని బట్టి ఏ గుణముతో ప్రవర్తిస్తున్నామో సులువుగా గుర్తించవచ్చు. గుర్తించిన తరువాత వాటిని మార్పు చేసుకోవాలి.

ఆంధ్ర సాహిత్యంలో భారత రామాయణంలోని పాత్రల తరువాత వరూధిని ప్రవరులే ప్రసిద్ధ పాత్రలు. ఈ రెండు పాత్రలు తెలుగు సాహిత్యంలో వెలుగు దీపాలు. సత్వగుణముతో సౌందర్యానికి సంప్రదాయానికి నిలయము ప్రవరుడు. ఉదయాన్నే నిద్రలేచి భగవన్నామస్మరణచేసి, నిత్యాగ్నిహోత్రం, నిత్యాన్నదానం అతని నిత్యకృత్యం. ఇంద్రియ నిగ్రహం గలవానిగా, ధనాపేక్ష రహితునిగా, తీర్థయాత్ర పట్ల ఆసక్తిగలవానిగా, హృదయ నిర్మలత్వం, తప్షసంపన్నత, వేదోక్త మార్గం, సచ్ఛీలత, నిషిత పరిశీలనాశక్తి, ప్రకృతి అందాలపట్ల ఆత్రుత, అమాయకత్వం, బ్రాహ్మణత్వం, ఏకపత్నీవ్రత్యం ధర్మప్రవృత్తి, సౌశీల్యము, మాతా పితృభక్తి మొదలగు సాత్వికగుణాలు సమాజంలోని యువతీ యువకులకు వ్యక్తిత్వ వికాసమును పెంపొందింపజేయును.

ప్రవరుని రూపురేఖా విలాసాలను, సత్వ గుణములను గూర్చి తెలుపుతూ పెద్దన చెప్పిన పద్యములో...

"ఆపురి బాయకుండు మకరాంక శశాంక మనోజ్ఞమూర్తి భా
షా పరశేషభోగి వివిధా ధ్వర నిర్మల ధర్మ కర్మ దీ
క్షా పరతంత్రుడంబరుహ గర్భ కులాభరణంబనారతా
ధ్యాపన తత్పరుండు ప్రవరాఖ్య డలేఖ్యతనూ విలాసుడై"

వరూధిని తమోగుణముతో ఆకర్షణీయమైన శక్తి గలది. ఆమె కామాగ్నిలో మైనమై కరిగిపోక వజ్ర హృదయుడై నిలిచి శీల రక్షణ చేసుకున్న ప్రవరుని మహనీయత నేటి యువతకు సత్వగుణము పెంపొందుటలోను, వ్యక్తిత్వ వికాసమును కలిగించుటలోను ఆదర్శనీయం – ఆచరణీయం.

అరుణాస్పదపుర వాస్తవ్యుడొక శ్రోత్రియ బ్రాహ్మణ కుమారుడు ప్రవరాఖ్యుడు జయంత– వసంత– కంతులను చక్కదనంబున గెలువజాలిన సుందరుడు. వివిధాధ్వర నిర్మల ధర్మ దీక్షా పరతంత్రుడు. అనారతాధ్యాపన తత్పరుండు. యవ్వనముందు యజ్ఞ ధనాఢ్యుడు, అనుకూలవతి సోమిదమ్మ అతని పత్ని. తల్లిదండ్రులకు సేవచేస్తూ సుఖముగా కాపురముండినవాడు. అతిథి పూజాతత్పరుడు తీర్థ సందర్శనాభిలాషి, పాదలేపనం లభించగా ముందు వెనుక చూసుకోకుండా, ఫ్రీ టిక్కెట్టు దొరికితే దొరికిందే తొందరగా విమాన ప్రయణానికి తయారయ్యే ఆత్రగాడివలే హిమాలయ భూములను దర్శించడానికి వెళ్లెను. పాదలేపనం కరిగిపోగా అప్రయోజకుడై దిగులుపడుతూ తమోగణముతో విరాజిల్లుతున్న వరూధిని ఉన్న కోనలోకి వెళ్ళినాడు. ఆకలిగొన్న మాంసాహారి వంటింట్లోకి వచ్చిన కుందేలుని విడువనట్లే వరూధిని ప్రవరుణ్ణి వలపు చూపుల వలలో చిక్కించుకుని దక్కించుకోవడానికి నానా తంటాలు పడ్డది. ప్రవరునికి తన సోమిదమ్మయందే గాని వరూధినియందు అనురాగము లేదు. వరూధిని యందు మనసుపడితే గృహస్థధర్మం పతనమై వ్యక్తిత్వం కోల్పోయి నేటి సమాజానికి ఆదర్శవంతుడు కాలేడు.

నేటి యువకులు కూడా సత్వగుణము గలిగిన ప్రవరుని వలె ఏకపత్నీవ్రతులై యుండి పర స్త్రీ వ్యామోహాన్ని విడనాడి భార్యయందు ప్రేమానురాగాలు కలిగియుండి తన వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవలెను.

అనాది నుండి నేటి వరకు సమాజంలో స్త్రీని భోగవస్తువుగా పరిగణించేవారు ఉన్నారు. మనుచరిత్రలోని సత్వగుణ సంపన్నుడైన ప్రవరుని వంటి వారు వర్తమాన పరిస్థితుల దృష్ట్యా సామాన్యులు స్త్రీకాంక్ష వదిలిపెట్టి, స్త్రీ పురుష సంబంధం ఏకప్రియానురక్తంగా మారి దాంపత్య ధర్మంగా రూపుదిద్దుకొని సాంఘిక జీవితానికి అంతిమంగా పునాదియైన కుటుంబంగా నిలబడి, ఆదర్శవంతమైన సమాజసాధనకు కృషిచేసింది. ఇది నేటి సమాజానికి ఆదర్శనీయమైనదిగా, అనుసరణీయమైనదిగా వెలుగొందుచూ వ్యక్తుల మానసిక ప్రవృత్తిలో మార్పులు తీసుకువస్తుంది. ఇది మనుచరిత్ర సాధించిన గొప్ప విజయం.

ఈ గ్రంథం స్త్రీ పురుషులు శారీరక, మానసిక సంబంధాల గురించి తెలియజేస్తుంది. సకల ప్రాణికోటికి సామాన్యమైన మైధునవాంఛని అణగిదొక్కాలని చూడటం కుదరనిపని. అలా అని చెప్పి శరీరవాంఛలని తమోగుణము కలిగిన వరూధిని వలె విచ్చలవిడిగా వదిలివేస్తే అది విపరీతానికి దారితీస్తుంది. శృంగార సుఖం అన్నివేళలా ఆనందాన్ని అందివ్వలేదని నేటి మానవలోకానికి సందేశాన్ని అందించింది. ఇందులో ప్రవరుడు, మాయాప్రవరుడు, స్వరోచి, ఇందీవరాక్షుడు, మనోరమ కళావతి విభావసి వంటి పాత్రలు మనుషులలోని విభిన్న వృత్తుల సంఘర్షణని వివరించేటువంటివి. త్రిగుణములలో ఒక్కొక్కరు ఒక్కొక్క గుణము

కలిగినటువంటి వారు. ఒకే వ్యక్తిత్వంలోని విభిన్న ప్రవృత్తుల సంఘర్షణల్ని ఇంత అద్భుతంగా వివరించిన రచన మనస్తత్వశాస్త్రం చెప్పే సిద్ధాంతాలకు వందల సంవత్సరాలకు పూర్వమే మన సమాజంలో ఉండటం మన ఆంధ్రుల అదృష్టం. ఇలాంటి రచనలు సమాజంలోని వ్యక్తుల సత్వగుణాభివృద్ధికి, భాషా వికాసానికి తద్వారా సమాజ సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడును.

బాహ్య సౌందర్యమునేగాక అంతఃసౌందర్యమును కూడా గుర్తింపగల ధీశాలి ప్రవరుడు. గృహస్థుడగువాడు నిర్లిప్తుడై, ఇంద్రియ విజయమును సాధించి, భగవత్ కైంకర్య రూపముగా, నిత్యనైమిత్తికాది కర్మలను యధావిధిగా కొనసాగించును. భగవద్భక్తి మార్గమున మోక్ష సామ్రాజ్యము నదిరోహింపగలడను పరమ సత్యమును బాగుగా గుర్తించిన ప్రవరుడు కామినీ విలాస విభ్రమములకు ఎట్లు లోనగును. మోహాంధులైన వారు చేయు వెకిలి చేష్టలకును, పసలేని మాటలకును విజ్ఞానియగు ప్రవరుడు మోహమునేలపొందును. యువకుడై యుండియు ప్రవరుడు ముగ్ధమోహనాంగియగు వరూధినికి లోబడలేదు. ఇంద్రియ విజయం నిష్కామకర్మయోగమున సాధింపవచ్చుననుటకు ప్రవరుడే నిదర్శనం. ఇనుపకచ్చడాలు కొట్టుకొనిన మునిమ్రుచ్చుల మనస్సులనైనను వికలము చేయగల తమోగుణము గలిగిన వరూధిని కోరికను తృణప్రాయముగా తిరస్కరించగలిగెను. ఇలాంటి విషయాల్ని బోధించే ప్రబంధాలు మానవజాతిలో సత్వగుణాభివృద్ధికి, తద్వారా వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందింపజేస్తాయి.

పరిపూర్ణ వికాసం కలిగిన ప్రవరునికి వరూధినిపై ఆగ్రహంకాని, జుగుప్సకాని ఏర్పడలేదు. ఆమెకు వివేకము కలిగించుటకు ఉపనిషత్తులలోని సారమును బోధించెను. మోహాంధులకు వివేకమును కలిగించి వారిని సన్మార్గగాములను చేయుట విద్యావంతుల కర్తవ్యం. కార్యసాధకునికి కావలసిన లక్షణములన్నియు సత్వగుణ విరాజితుడైన ప్రవరునిలో గలవు.

దేశ రాజధాని నడిబొడ్డున బలాత్కరించబడి బలి అయిపోయిన "నిర్భయ"ను మింగేసిన మగ మద మృగాలున్న నేటి సమాజానికి మను చరిత్రలోని సత్వగుణ సంపన్నుడైన ప్రవరుని పాత్ర అత్యంత ఆదర్శనీయం. తీవ్రములైన కామముతో కూడిన కోరికలతో మీద పడుతున్న తుమోగుణం గల వరూధిని వంటి వారిని చీత్కరించుకొని "చెప్పకుమిట్టి తుచ్ఛసుఖముల్ మీసాలపై దేనియల్" అంటూ ప్రవరుడు పలికిన మాటలు సమాజానికి పసిడి మూటలు. నేటి యువతకు కళ్ళు తెరిపించి వారిలో మార్పులు తీసుకువచ్చి సత్వగుణం కలిగిన వారిగా మార్పుచెంది మనోవికాసాన్ని కలిగించును.

వరూధిని ప్రవరునిపై మనసు పడిందని చెప్పినప్పుడు జవాబుగా తన కులం గురించి, తల్లిదండ్రుల గురించి, ఇంటికి వెళ్లకపోతే జరిగే నష్టం గురించి అమాయకంగా చెబుతాడు. ధర్మాధర్మాల గురించి వాదించుకున్నారు. అలింగనం ఆఖరి ఆయుధంగా వరూధిని ప్రయోగించింది. పాషాణమైన హృదయముగల ప్రవరుని మీద ఈ ప్రయోగం ఫలించలేదు. నేటి మన యువత నిగ్రహం కోల్పోకుండా తమ జీవిత గమ్యం వైపు ప్రయాణం సాగించాలి.

పరాయి స్త్రీని తల్లిగా, తోబుట్టువుగా భావించుట ప్రవరుని యొక్క వ్యక్తిత్వాన్ని తెలుపుతుంది. తీవ్రమైన తామసగుణం కలిగిన వరూధినిని సోదరిగా భావించాడు. నా సేవలకి నా తల్లిదండ్రులు ఎదురుచూస్తారు. నేను తొందరగా ఇంటికి వెళ్లాలన్న ప్రవరుని మాటల్లో తల్లిదండ్రులను గౌరవించి వారి ఋణం తీర్చుకోవాలని సామాజిక ధర్మం తెలుస్తుంది.

నేడు వివాహము పేరుతో ఎందరో యువతులను మోసం చేస్తున్న నిత్య పెళ్ళికొడుకు వంటివాడు మాయాప్రవరుడు. ఇతడు కూడా వరూధిని వలె తీవ్రమైన తామసగుణం గలవాడు. వరూధినికి కళ్ళబొల్లి కబుర్లు చెప్పి అవకాశం చూసుకుని తన కోర్కె తీర్చుకొని ఆమె గర్భానికి కారకుడై చల్లగా జారుకున్నాడు. నేడు ఎందరో అభాగినులు ఇలాంటివారి మాయలో పడి దిక్కుగానక తనువులు చాలించుకుంటున్నారు. తమ వ్యక్తిత్వాన్ని కోల్పోయి తల్లిదండ్రులకు తీరని దుఃఖాన్ని మిగులుస్తున్నారు. అలాంటి వారికి సాత్వికుడైన ప్రవరుని చరిత్ర ఒక దిక్సూచి వంటిది. జరిగే పరిణామాలను గూర్చి జాగృతం చేస్తుంది. జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొని వారికి దిశానిర్దేశం చేస్తుంది.

## ఆధార గ్రంథములు:


1. సమగ్ర ఆంధ్ర సాహిత్యం – ఆరుద్ర (రెండవ సంపుటం–2003), తెలుగు అకాడమీ, హైదరాబాద్.
2. వ్యాస ప్రభాకరం – వేటూరి ప్రభాకర శాస్త్రి (1990), ఆంధ్ర సారస్వత పరిషత్, హైదరాబాద్.
3. తెలుగు సాహిత్య సమీక్ష (రెండవ సంపుటం–1999) డాక్టర్ జి. నాగయ్య, నవ్య పరిశోధక ప్రచురణలు, తిరుపతి.
4. మనుచరిత్ర – మన చరిత్ర (2012) – ఆచార్య గార్లపాటి దామోదరనాయుడు, తెలుగు అకాడమీ, హైదరాబాద్.